# చిత్తశుద్ధిలేని శివపూజలు

ఓసంవత్సరమంతా పిల్లల్ని కనొద్దని చెప్పడానికి ఆ మంత్రేవన్నా తను సృష్టి కర్త ననుకుంటున్నాడా? ఈ సృష్టిక్రమం అంతా తన చేతిలో వుందను కొంటున్నాడా?

మీ ఫ్రెండ్ సారా కథలశాస్త్రిగారు. సెల విచ్చినట్లు ఈ గవర్మెంటుకు నిజంగా పిచ్చెక్కుతోన్నట్లుంది. నెల తప్పితే జుల్మానా వేయిస్తారా లేక పొరపాటున పిల్లనికంటె పీక ఉత్తరించేస్తారా నాకు తెలీకడుగుతాను. పెద్ద కుర్చీలో కూర్చోగానే బుర్ర పట్టని ఆలోచన్లా. వెర్రి

వేపకాయ బుద్ధులూ పుట్టుకొస్తా యన్నారిందుకే- ఏదో విధంగా పెళ్ళాడ్డం మానిపించొచ్చు గాని పెళ్ళాడిన వాళ్ళను మనసు కట్టుకోమనడం ఎలా? ఈ గవర్మెంటువాళ్ళ కేకలూ అరుపులూ గోడలమీద కాయితా లంటించడాలూ ఇవన్నీ చిత్త శుద్ధి లేని శివపూజలు.

అదేవిటది? అదేదో దిక్కుమాలిన సంవత్సరం....నిష్ఫలతాన సంవత్సరం జరుపు కుంటారంటగా గవర్మెంటూ! గవర్మెంటుకి ఎలాగూ పిల్లలు పుట్టరుగా? దానికెందుకు సంతానం వొద్దని పూజలు చేయడం? ఈ వరస చూస్తోంటే-గొడ్రాళ్ళకు బహుమతు లిచ్చి భ్రూణహత్యల్ని చూసీ చూడనట్లు వదిలేసి గర్భస్రావాల్ని అభినందించే లాగుంది?

కొంచెం అలుసిస్తే చాలు-అవకాశవాణివారు "సంతాన నిరోధమూ-కుటుంబనియంత్రణమూ" అంటూ ఇల్లాళ్ళకు పిల్లల తల్లులకు మనసు నొచ్చుకుంటుందనేనా బుద్ధీ జ్ఞానమూ లేకుండా టాకులు టాకుతారు. ఈ ప్రోగ్రామసింహాలన్నీ మళ్ళీ ఇళ్ళ కెళ్ళగానే పెళ్ళాల కొంగట్టుకు తిరుగుతాయి. వనితావాణిలో పిల్లల్ని కనొద్దని టాకు టాకినావిడ మల్లెపూలు తల్లో పెట్టుకుని మరచెంబు చేత్తోపట్టుకుని మేడ మెట్లెక్కి-రేడియో ఆపు జేస్తుంది. దీపం ఆర్పుతుంది. సంతాన నిరోధం ఫైలు అలమార్లో పెట్టి "సెలియా కనరావా" అని పాడతాడు గుమాస్తా.

సినిమాల కెళ్ళి చూడండి. రెండర్థాల సినిమా పాటలూ ఆ రికార్డులు వినండి. పత్రికలలో సీరియల్సు చూడండి. వాల్ పోస్టర్లు - వ్యాపార ప్రకటనలు చూడండి. అన్నింట్లోనూ ఆడదే ప్రత్యక్షం- కేలండర్లూ బూతు పుస్తకాలూ వీటి మాట అలా వుంచండి. మనం ఎలా డ్రెస్సు వేసుగుంటున్నాం....వీలయినంత శృంగారంగా వొళ్ళు కనిపించేలా అలంకరించుకుంటూ తిరుగుతున్నాము. ఒకర్నొకరు ఆకర్షించుకోవడానికి పడే తాపత్రయం మితిమీరిపోతోంది. ఇవే మీ తప్పులేదు-ఇవన్నీ ఇలా

వుంటూండగా "నిస్సంతాన సంవత్సరం" జరుపుతుందిట గవర్మెంటు. పిల్లలు ఎక్కువ మంది కలవాళ్ళను తల్లులను నొప్పించ కుండా ఒక్కటాకు కూడా వుండదు. మాత్తర్లు మింగడం, లూపులు వాడటం అనుకుంటున్నారు గాని సృష్టిక్రమాన్ని అదుపులో పెట్టడం అని తెలుసుకోలేరేం ఈ బుద్ధి జాడ్య జనితోన్మాదులు. సకలశాస్త్ర విద్యాపారంగతులు.

ఉన్నమాట చెబుతున్నాను. పిల్లల్ని నిందిస్తే పిల్లల తల్లికి కష్టంగా వుంటుంది. పిల్లల తల్లికి కష్టం కలిగితే ఈ ఉద్యమం అంతా దెబ్బ తింటుంది. ఎంతో సున్నితమైన ఈ సమస్యను పరమ మోటుగా డీల్ చేస్తుంది ప్రభుత్వం. అందుకనే సంతానం కనొద్దని గవర్మెంటు సంవత్సరం పొడుగూతా గొడవచేస్తే అమాయక ప్రజలకు ధ్యాస యిటు వేపే మళ్ళి ఈ సంవత్సరం మరీ ఎక్కువమంది పాపాయిలు పుట్టుకొచ్చి వాళ్ళంతా పెరిగి పెద్దవాళ్లయి కక్ష గట్టి ప్రతి పక్షంలో చేరొచ్చు! గొప్ప డేంజర్.

చెప్పిన మాట వినక ప్రజలు పిల్లల్ని కంటూ వుంటే గవర్మెంటు ఏం చేస్తుంది? చిర్రెత్తి పోయి ఆసుపత్రిలో ముగ్గురి కన్నా పురుళ్ళు పోయమని బోర్డు కట్టేస్తుంది. స్కూళ్ళలో ముగ్గురి కంటే ఒక ఇంట్లో పిల్లలకి చోటు లేకుండా చేస్తుంది. ఆడవాళ్ళకు పురుళ్ళు పోయమని మగవాళ్ళకు ఇంక్రిమెంట్లు బందు చేస్తుంది. రైల్వే వాళ్ళకు ప్యాసుల్లో ఎక్కువ మంది పిల్లలకు చోటు లేకుండా చేస్తుంది గవర్మెంటు. ఉద్యోగుల మీద గవర్మెంటు పిల్లల్ని కన్నందుకు పన్నులు ఎక్కువచేసి కక్ష తీర్చుకుంటుంది. మరి మన దేశంలో చదువూ సంధ్యా లేకుండా కూలీ నాలీ చేసుకునే జనాభా ఎంతో వుంది. వీళ్ళందరూ రేడియో టాకులు వినరు. పుస్తకాలూ చదవరు కనుక తెలీక "నిస్సంతాన సంవత్సరమంటూ" జరుపుతుందా మని ముందుకు రావచ్చు. ఆ విధంగా జయ

ప్రదం కావాలి. ఈ ప్రచారం చేసే వాళ్ళొచ్చి మీ కెంతమంది పిల్లలు?" అనగానే జుట్టుపట్టుకు వీసె గుద్దులు నాలుగువేసి ఎడాపెడా వాయించాలని పిస్తుంది సామాన్య గృహిణికి. మా సుబ్బమ్మత్తలాటిది పక్కనుంచే- "లంజకానా-" అని అందుకుంటుంది నోటి కొచ్చినట్లు. ఈ టింగు రంగమ్మలు పుంజాలు తెంపుకుని పారి పోవాల్సిందే! సుఖంగా వుండాలంటే మన వంశక్షయానికి మనమే మార్గాలు వెతుక్కోవాలి. ఇలా జనం పెరిగిపోతే ఎవరికీ ఏదీ దొరక కుండా ధరలు పెరిగిపోతాయట. ఇప్పుడే ఏదీ చేయలేకపోతోంది. పాపం మన ప్రభుత్వం- ఇకముందు కూర్చున్న చోటునుంచి లేవలేదు. ఆసుపత్రిలో నెలలు నిండిన ఆడవాళ్ళకు ఇహ నుంచీ జరగ వలసిన మర్యాదలు జరగవు. ముగ్గురి కంటె ఎక్కువ మంది సంతానాన్ని కలిగిన స్త్రీలంతా ఈ నిస్సంతాన సంవత్సరంలో పొరపాటున పిల్లల్ని కని గవర్మెంటుకి గిట్టనివాళ్ళ జాబితాలో చేరిపోయే ప్రమాదం వుంది.

నేను ఫస్టుఫారం ప్యాసవలేను కాని నాకు అన్నీ తెలుసు సావా కథలశాస్త్రిగారు చెప్పడం కాదు — ఈ జనాభా సమస్య నిజంగా గవర్మెంటుకి పిచ్చెక్కిస్తోంది. అప్పుడది యిలా పాడుతుంది.

"తవ్వాకు గజ్జెలు కడితే
తవ్వాడు తుందీ!
నీకూ గజ్జెలు కడితే
నువ్వాడుతావూ!
నాకూ గజ్జెలు కడితే
నే నాడు తాను" అని.